ఈనాడు
కుమురం భీం
సోమవారం ఆగస్టు 31, 2026

ఇంకెన్నాళ్లీ కవరింగ్..

● కుమురంభీం ప్రాజెక్టు కుంగిన కట్ట మరమ్మతుల్లో అంతులేని జాప్యం

వాంకిడి, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మండలాల్లో 45,500 ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంతో నిర్మించిన కుమురంభీం జలాశయం.. ఇప్పటి వరకు లక్ష్యంలో సగానికి కూడా అందించిన దాఖలాలు లేవు.


ప్రాజెక్టు కట్టపై కప్పిన పాలిథిన్ కవర్లు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

కుమురంభీం ప్రాజెక్టు మట్టికట్ట (ఎర్త్ బండ్) కుంగి ఏళ్లు గడుస్తున్నా.. మరమ్మతులు లేక ఆయకట్టుదారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. 2022 జులైలో కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టులో 1.67 లక్షల క్యూసెక్కుల వరద చేరగా.. విపరీతమైన ఒత్తిడితో మట్టికట్టకు తీవ్ర నష్టం వాటిల్లింది. అప్పటి నుంచి మరమ్మతుల కోసం వివిధ ఏజెన్సీల ద్వారా ప్రాజెక్టు పరిస్థితులపై అధ్యయనం చేయిస్తున్నారు. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో అటు వర్షాలు సరిగా కురవక, ఇటు ఆయకట్టుకు నీరందక రైతులు పంటలు సాగు చేసుకోలేకపోతున్నారు.

● వరద తాకిడికి మట్టికట్ట గార్జ్ పోర్షన్ కుడి వైపు భాగంలో చైనేజ్ 750 మీటర్ల నుంచి 950 మీటర్ల వరకు దెబ్బతింది. కట్టపై నిలువుగా చీలికలు ఏర్పడ్డాయి. పై భాగం నుంచి 2-3 మీటర్ల లోతు వరకు ఎగువ వైపు ఉన్న పారాపెట్ గోడ జారిపోయింది. దీని నష్టంపై నిపుణులతో పరిశీలన చేయించాలని గుత్తేదారు సంస్థకు ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు నోటీసు జారీ చేసినా.. స్పందించలేదు. చివరకు శాఖ తరఫునే జలాశయం పరిస్థితిపై అధ్యయనం చేయిస్తున్నారు.

● మొదట వరంగల్ నిట్ నుంచి జియాలజీ ప్రొఫెసర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టం మరింత పెరగకుండా ఉండేందుకు.. కట్టపై పాలిథిన్ కవర్లు కప్పి.. నీటి నిలువ 238 మీటర్ల స్థాయిలోనే ఉంచాలని సూచించారు. దీంతో 10.93 టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులో ఆరు టీఎంసీలకే పరిమితం చేస్తున్నారు.

● గతేడాది జలాశయం వద్ద పరీక్షల బాధ్యతలను పుణేకు చెందిన సీడబ్ల్యూపీఆర్ఎస్(సెంట్రల్ వాటర్ పవర్ రీసోర్స్ స్టేషన్)నిపుణుల కమిటీకి అప్పగించారు. ప్రభుత్వం రూ.82 లక్షలు మంజూరు చేయగా.. వీటిలో రూ.66 లక్షలను సంస్థకు చెల్లించారు. వీరు క్షేత్రస్థాయిలో పరిశీలించి జియోఫిజికల్ టెస్టులు పూర్తి చేసి రిపోర్టు అందించారు. ప్రస్తుతం జియోటెక్నికల్‌కు సంబంధించి కట్టపై బోర్‌హోల్స్ వేసి పరిస్థితి అధ్యయనం చేయాల్సి ఉంటుందని కమిటీ సూచించడంతో ఇంజినీరింగ్ అధికారులు అందుకు అవసరమైన నిధులు రూ.44 లక్షలతో అంచనాలు సిద్ధం చేసి టెండర్ పిలిచారు.

● ఇప్పటికే మరమ్మతుల కోసం ఒక సారి రూ.19.32 కోట్ల అంచనాతో పనుల నివేదిక రూపొందించారు. తాజాగా జియో టెక్నికల్ పరీక్షలు చేపట్టాల్సిన నేపథ్యంలో.. మళ్లీ కొత్తగా నిధుల అంచనాలు తయారు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

● పరీక్షలు చేసి, రిపోర్టు వచ్చి, ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు మొదలు పెట్టాలంటే.. మరో ఏడాది పట్టవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తెగిపోయిన పైప్‌లైన్.. నిలిచిన నీటి సరఫరా

వాంకిడి మండలం బంబార గ్రామ పంచాయతీ పరిధిలో గోండ్‌కోసారాకు వెళ్లేదారిలో ఉన్న వాగులో మిషన్ భగీరథ పైప్‌లైన్ నీటి ప్రవాహానికి తెగిపోయింది. దీంతో గోండ్‌కోసారా, ఇందిరానగర్ గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామస్థులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బావులు, వాగుల నుంచి నీటిని తెచ్చుకొని వాడుకుంటున్నారు. పైప్‌లైన్ తెగిపోయి 20 రోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.
- న్యూస్‌టుడే, వాంకిడి



అమలుకు దూరంగా.. నో బ్యాగ్ డే

● 'భారం'గా మారుతున్న చదువులు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే

పాఠశాలల్లో విద్యార్థులపై పుస్తకాల భారాన్ని తగ్గించి సృజనాత్మకతను పెంచాలని జాతీయ విద్యా విధానం-2020 చెబుతున్న 'నో బ్యాగ్ డే' జిల్లాలో అమలు కావడం లేదు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 1,208 ఉండగా 1,00,618 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రతి నెలా మూడో శనివారం అమలు చేయాలని విద్యాశాఖ గత విద్యా సంవత్సరం ఆదేశాలిచ్చినా.. అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి.

● గతేడాది కొన్ని బడుల్లో మొక్కుబడిగా నిర్వహించినా ఈ సారి ఎక్కడా కనిపించడం లేదు. ఉపాధ్యాయులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు మూడో శనివారం యథావిధిగా పుస్తకాల సంచులతో బడికి వెళ్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని అమలయ్యేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వారంలో ఆరు రోజులు

● నిర్ణీత సమయానికి సిలబస్ పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు సాధారణ తరగతులకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

● ప్రాజెక్టు పనికి, ఆటపాటలు, బయటి ప్రాంతాల సందర్శనకు తగిన వసతులు లేకపోవడం, బోధనేతర పనులు, రికార్డుల నిర్వహణతో.. ఉపాధ్యాయులు సతమతం అవుతుండటంతో నో బ్యాగ్ డే అమలుకు నోచుకోవడం లేదు. ఫలితంగా విద్యార్థులకు చదువు పెద్ద భారంగా మారుతోంది.

● వారంలో ఆరు రోజులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నా.. ఆదివారం వచ్చే ఒక్క సెలవు రోజునా.. విద్యాసంస్థలు హోంవర్క్‌లు, ప్రాజెక్టు వర్క్, వీక్లీ టెస్టుల పేరుతో పిల్లల మెదడుపై తీవ్ర ఒత్తిడి పెంచుతున్నాయి. వీటి కారణంగా విద్యార్థుల్లో చురుకుదనం తగ్గి యంత్రాల్లా మారుతూ కిలోల కొద్దీ పుస్తకాల సంచులను మోసుకెళ్తున్నారు.

● జాతీయ విద్యావిధానం మార్గదర్శకాల ప్రకారం.. విద్యార్థులపై పుస్తకాల బరువు, మానసిక ఒత్తిడి తగ్గించి సృజనాత్మకతను పెంపొందించే ఉద్దేశంతో దీన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఆ రోజున విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లో లేని విషయాలను నేర్చుకుంటారు.

నిర్వహించాల్సిన కార్యక్రమాలు ఇలా

- ఆటలు, యోగా, శారీరక వ్యాయామాలు చేయించడం.
- చిత్రలేఖనం, శిల్పకళ, నృత్యం, సంగీతం, పాటలు పాడించడం, హస్తకళలు నేర్పించడం. సైన్స్ ప్రయోగాలు, తోటపని, పర్యావరణంపై అవగాహన కల్పించడం.
- ఉపన్యాసం, క్విజ్ పోటీలు, నాటికలు, కథలు చెప్పడం, బృందంగా ఏర్పడి ఒక అంశంపై చర్చించడం. బాలసభ వంటి కార్యక్రమాల నిర్వహణ.
- నో బ్యాగ్ డే రోజు తరగతి గది బోధనకు బదులుగా ఆచరణాత్మక, విజ్ఞానదాయక కార్యక్రమాల అమలు.. తదితర కార్యక్రమాలు విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించి పాఠశాల వాతావరణాన్ని ఆహ్లాదంగా మార్చుతాయి. కేవలం బట్టీ విధానం కాకుండా ప్రయోగాత్మక, నైపుణ్య ఆధారిత అభ్యసనాన్ని ప్రోత్సహించడం, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడేలా కార్యక్రమాలు నిర్వహించడం.. వంటి వాటికి ఈ విధానం అమలు ఎంతగానో దోహదపడుతుంది.

అత్యవసర వైద్యానికి అష్టకష్టాలు

● రహదారి సౌకర్యం లేక గిరి గ్రామాలకు వెళ్లలేకపోతున్న 108, 102 వాహనాలు

మూడు రోజుల కిందట పెంచికల్‌పేట్ మండలంలోని జిల్లేడ గ్రామానికి నిండు గర్భిణి జ్ఞానేశ్వరికి పురిటినొప్పులు రావడంతో.. కుటుంబసభ్యులు అంబులెన్సుకు సమాచారమిచ్చారు. గ్రామానికి దారి సౌకర్యం లేక కమ్మర్గాం వరకు వచ్చి వాహనాన్ని నిలిపారు. దీంతో గర్భిణిని సరకులు తరలించే ఓ వాహనంలో తరలించారు. అక్కడి నుంచి 108 వాహనంలో బెజ్జూర్ పీహెచ్‌సీకి తరలించారు.



వారం రోజుల కిందట తిర్యాణి మండలంలోని దొడ్డిగూడ గ్రామానికి చెందిన కుడ్మేత ఏసుబాయి. వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురైంది. గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో.. ఆమెను చికిత్స కోసం ఎడ్లబండి మీదపై ఉంచి దాదాపు 15 కిలోమీటర్ల దూరంలోని రొంపల్లి వరకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి ఆటోలో తిర్యాణి ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.



గతేడాది ఆగస్టు 22న లింగాపూర్ మండలంలోని ఎల్లాపాటర్ కొలంగూడకు చెందిన లక్ష్మీబాయికి పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. కుటుంబీకులు 102 వాహనానికి సమాచారమిచ్చారు. ఎల్లాపాటర్ గ్రామం వరకు రహదారి బాగుండటంతో.. అక్కడి వరకు వాహనం వచ్చింది. కొలంగూడ నుంచి సుమారుగా మూడు కిలోమీటర్ల దూరం వరకు నొప్పులతో బాధపడుతూ నడుచుకుంటూ వాహనం వద్దకు వచ్చింది. అక్కడి నుంచి సిబ్బంది ఆదిలాబాద్ రిమ్స్‌కు తీసుకెళ్లారు.

లింగాపూర్, పెంచికల్‌పేట్, తిర్యాణి, న్యూస్‌టుడే

పరిశీలన

జిల్లాలోని మారుమూల పల్లెలు, గిరిజన గ్రామాలు ఇప్పటికీ సరైన రహదారి సౌకర్యానికి నోచుకోవడం లేదు. వర్షాకాలంలో రాకపోకలకు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఏదైనా అనారోగ్య సమస్యలు ఎదురైనా, గర్భిణుల అత్యవసర సమయాల్లో సమీప ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లాలన్నా.. బురదదారులు, వాగులపై వంతెనలు లేని కారణంగా 108, 102 అంబులెన్సులు వెళ్లలేని పరిస్థితి. కాలినడక లేదా ఎడ్లబండ్లే దిక్కవుతున్నాయి. కిలోమీటర్ల దూరం అష్టకష్టాలు పడుతూ ఆసుపత్రులకు చేరుకుంటున్నారు. వైద్యసిబ్బంది గర్భిణుల కోసం ముందస్తు చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. రహదారులు లేక ఎక్కడోచోట ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

● ప్రధానంగా ఏజెన్సీ ప్రాంత మండలాల్లో ఇటువంటి వంటి దయనీయ పరిస్థితులు రోజుకో చోట చోటుచేసుకుంటున్నాయి. ప్రసవ సమయం దగ్గర పడిన వారి కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. సమాచారం అందిన వెంటనే అత్యవసర సిబ్బంది స్పందిస్తున్నా.. దారులు లేక గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి.

● పురిటినొప్పులతో గర్భిణులు ద్విచక్ర వాహనాలు, ఎడ్లబండ్లు లేదా కాలినడకన కొన్ని కిలోమీటర్లు నడిచి అక్కడి నుంచి వారిని వాహనాల్లో ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఇటీవల పెంచికల్‌పేట్, తిర్యాణి మండలాల్లో గర్భిణుల అవస్థలు పడిన ఘటనలే నిదర్శనం.

కనురెప్పలా కాపాడి.. ప్రాణం తీశావెందుకమ్మా!

● కూతురిని నడుముకు కట్టుకొని బావిలో దూకిన తల్లి
● ఇద్దరి మృతితో లింగాపూర్‌లో విషాదం

అమ్మా!.. ఎంత పని చేశావమ్మా..
నాకు చిన్న గాయమైతేనే తల్లడిల్లిపోతావు..
నేను తింటుంటే.. పొలమారితేనే విలవిలలాడతావు..
అలాంటి నువ్వు ఊపిరాడని నీటిలో ఎలా పడేశావమ్మా..
ఎంతో అల్లారుముద్దుగా పెంచావు..
నా భవిష్యత్తు కోసం కలలు కన్నావు..
చక్కగా తయారు చేసి బడికి పంపి సంబరపడ్డావు
తమ్ముడితో కలిసి ఆడుకుంటుంటే మురిసిపోయావు
క్షణికావేశంలో నా భవిష్యత్తు.. నీ కలలు గుర్తుకు రాలేదా..
నిండునూరేళ్లు జీవించమని దీవించే నువ్వే జీవితాన్ని ముగించావు.
మనమిద్దరం కనిపించక తమ్ముడు గుక్కపట్టి ఏడుస్తున్నాడమ్మా..
ఇంత కఠిన నిర్ణయం ఎందుకు తీసుకున్నావమ్మా..

దండేపల్లి మండలం లింగాపూర్‌లో తల్లి రజిత కూతురిని నడుముకు కట్టుకొని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. చిన్నారి అక్షిత ఆవేదనకు అక్షర రూపమిది.
- న్యూస్‌టుడే, దండేపల్లి గ్రామీణం


పిల్లలు అక్షిత, మహేందర్‌లతో తల్లి రజిత(పాత చిత్రం)

వివరాలు ప్రధాన సంచికలో

ప్రజలను జాగృతం చేసిన మహనీయుడు ఫూలాజీబాబా

జైనూర్, న్యూస్‌టుడే : జనహితం కోసం ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలతో ప్రజలను జాగృతం చేసిన మహనీయుడు సద్గురు సంత్ ఫూలాజీ బాబా అని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఆదివారం బాబా 102వ జయంతి పురస్కరించుకొని భక్తులు ధ్యానధారణ, సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జుపటేల్, కలెక్టర్ హరిత, ఐటీడీఏ పీవో మంద మకరందుతో కలిసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఎంపీ మాట్లాడుతూ... బాబా చూపిన ఆధ్యాత్మిక, ధ్యాన మార్గాల ద్వారా అనేక కుటుంబాలు సన్మార్గంలో నడుస్తున్నాయన్నారు. బాబా సంస్థాన్‌లో అభివృద్ధి పనులకు రూ.10 లక్షలను మంజూరు చేస్తానన్నారు. కలెక్టర్, పీఓలు మాట్లాడుతూ.. ప్రజల్లో ఆధ్యాత్మిక మార్పు తీసుకువచ్చి సమాజానికి గొప్ప సేవలు అందించిన తీరు ప్రశంసనీయమన్నారు. కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు సిద్దేశ్వర సంస్థాన్ ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ.. సంస్థాన్‌లో అవసరమైన వసతుల కల్పనకు వీబీ జీరాంజీ పథకంలో మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, డీఎస్పీ అశోక్, మహారాష్ట్రలోని ఉమ్మర్‌ఖేడ్ మాజీ ఎమ్మెల్యే నాందేవ్ ససానే, ఉత్తంరావు ఇంగ్లే, మహారాష్ట్ర రిటైర్డ్ కమిషనర్ సర్‌కుండే సంభాజీ, కాంగ్రెస్ ఆసిఫాబాద్ ఇన్‌ఛార్జి శ్యామ్‌నాయక్, మార్కెట్ కమిటీ ఛైర్మన్‌లు నర్సయ్య, విశ్వనాథ్‌రావులు, సర్పంచి ఖందారే లక్ష్మి, సంస్థాన్ గౌరవ అధ్యక్షుడు వామన్ ఇంగ్లే, అధ్యక్షుడు కేశవ్ ఇంగ్లే, సంస్థాన్ భక్తులు, తదితరులున్నారు.


పట్నాపూర్‌లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ నగేశ్, కలెక్టర్ హరిత, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, పీఓ మంద మకరందు


కార్యక్రమానికి హాజరైన భక్తులు


ఎంపికైన వారితో సెలక్షన్ కమిటీ సభ్యులు

అట్టహాసంగా మహిళల క్రికెట్ ఎంపిక పోటీలు

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళల క్రికెట్ ఎంపిక పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఉమ్మడి జిల్లా నుంచి యాభై మందికి పైగా హాజరై తమ ప్రదర్శన చాటారు. బౌలింగ్, బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి క్రికెట్ ఆపరేషన్ కమిటీ సభ్యులు జి.రవికుమార్‌రెడ్డి (హెచ్‌సీఏ చీఫ్ కో-ఆర్డినేటర్), ఎం.రేవతి (సభ్యురాలు) హాజరయ్యారు. వయసులవారీగా సంబంధిత జట్లకు ఎంపిక చేస్తామని, నిత్యం సాధన చేస్తూ ఆటను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కోదాటి ప్రదీప్, మేనేజర్ వేణుమాదవ్, కోచ్ పొరండ్ల ప్రదీప్, సీనియర్ క్రీడాకారులు చందు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సందర్శించి.. పరిస్థితి తెలుసుకొని



మాట్లాడుతున్న న్యాయమూర్తి సంకేత్ మిత్ర

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని ప్రత్యేక ఉప ఉన్నత కారాగారాన్ని ఆదివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వి.సంకేత్ మిత్ర సందర్శించారు. జైలు ఆవరణలోని పరిసరాల్లో తిరుగుతూ వంట గది, ఖైదీలు ఉండే బ్యారక్‌లు, వసతులను పరిశీలించారు. అందుతున్న సేవలపై ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. తెలిసీ తెలియక చేసిన తప్పులతో వచ్చిన విచారణ ఖైదీలు.. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా సత్ప్రవర్తనతో మెదలాలని సూచించారు. కేసు విచారణకు న్యాయవాదిని నియమించే ఆర్థిక స్థోమత లేని పేద వారు దరఖాస్తు చేసుకుంటే సంస్థ తరఫున ఉచిత న్యాయ సహాయం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి ప్రేంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమా.. పునరుద్ధరణ లేక

రెబ్బెన, న్యూస్‌టుడే

ఏదైనా కారణంతో మృతి చెందినా 59ఏళ్లలోపు ఉండి అన్నదాత మరణిస్తే కుటుంబానికి ఆసరాగా రూ.5 లక్షలు అందించే ప్రభుత్వ రైతుబీమా పథకం డోలాయమానంలో పడింది. ఏటా ఆగస్టులో రైతు బీమాలో ఉన్న వారి వివరాలను రెన్యూవల్‌కు (పునరుద్ధరణ) సిఫార్సు చేసేవారు. కొత్తవారిని చేర్చడానికి అవకాశం కల్పించేందుకు అర్జీలు స్వీకరించేవారు. ఈ వివరాలన్నీ వ్యవసాయ శాఖ ద్వారా ఎల్‌ఐసీకి సమర్పించే వారు. అయితే ఈ నెల 13వ తేదీతో గడువు ముగిసినా.. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో.. అన్నదాతలు అయోమయంలో పడ్డారు. పథకం కొనసాగుతుందో..లేదోనని ఆందోళన చెందుతున్నారు. అయితే ప్రభుత్వం కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని 'ఇందిరమ్మ కుటుంబ జీవిత' బీమా పేరిట కొత్త పథకం అమలు చేయాలని యోచిస్తోంది.

● 18-59 ఏళ్ల వయసున్న అన్నదాతలు మృతి చెందితే రూ.5 లక్షల ఆర్థికసాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది. గుంట భూమి ఉండి పట్టాపాసు పుస్తకం ఉన్న వారంతా అర్హులే.

● గత సంవత్సరం ఒకరికి రూ.3,225 చొప్పున ప్రీమియం ప్రభుత్వం బీమా కంపెనీకి చెల్లిస్తూ వచ్చేది. బాధిత కుటుంబానికి పది రోజుల్లోపే సాయం నామినీ ఖాతాలో జమయ్యేది.

● ఏటా నెల రోజుల ముందుగా బీమాకు సంబంధించి దరఖాస్తు విధానం ఉండేది. ఈసారి 2026-27కు సంబంధించి ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

నాలుగేళ్ల కాలంలో రైతుబీమా వివరాలు

సంవత్సరం	●	●
2022-23	463	23.15
2023-24	521	26.05
2024-25	576	28.8
2025-26	484	24.2

● లబ్ధిపొందిన కుటుంబాలు
● పరిహారం (రూ. కోట్లలో)

రెండు వేల మంది రైతులు..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 1.40 లక్షల మంది రైతులు ఉన్నారు. ఇందులో రైతుబీమా పథకంలో 74,567 మంది నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. గడిచిన నాలుగేళ్లలో 2,044 మంది మృతి చెందినట్లు అధికారిక గణంకాలు చెబుతున్నాయి. బాధిత కుటుంబాలకు రూ.102.02 కోట్ల మేరకు పరిహారం చెల్లించారు.

పథకాన్ని కొనసాగించాలి

ప్రతి రైతన్న కుటుంబ పరిస్థితి అంతంతే మాత్రమే. రైతుబీమా పథకం కుటుంబానికి అండగా నిలుస్తోంది. రూ.5 లక్షలు వస్తే అప్పులు తీర్చుకోవడానికి లేదంటే కుటుంబంలోని ఆడబిడ్డ వివాహానికి జీవనం గడిపేందుకు ఆసరాగా ఉంటాయి. ప్రభుత్వం పునరాలోచించి పథకాన్ని కొనసాగించాలి. - రాయిల్ల నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి



ఈ విషయమై రెబ్బెన వ్యవసాయ అధికారి దిలీప్‌కుమార్‌ను సంప్రదించగా.. రైతు బీమా పథకం కొనసాగింపుపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదన్నారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు ముందుకు సాగుతామని చెప్పారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న సీఐ ఎం.సంజయ్

రెబ్బెన, న్యూస్‌టుడే: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెబ్బెన సీఐ ఎం.సంజయ్ అన్నారు. జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు.. ఆదివారం రెబ్బెన ఎన్టీఆర్ కాలనీలో కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటీపీలు, బ్యాంకు వివరాలు అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే 112కు కాల్ చేయాలన్నారు. డ్రగ్స్ 1908, సైబర్ క్రైం 1930 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. ముందుగా గ్రామంలో తనిఖీలు చేపట్టారు. అక్రమంగా మద్యం విక్రయాలకు సంబంధించి ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. 40 వాహనాలను తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శిరస్త్రాణం ఆవశ్యకతను వివరించారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎస్సై వెంకటకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

1న ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాల మైదానంలో సెప్టెంబర్ 1న.. ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జూనియర్స్ బాలికల ఎంపిక పోటీలు ఉంటాయని ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధి రఘునాథరెడ్డి తెలిపారు. 01.01.2011 నుంచి 31.12.2013 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. పాల్గొనే వారు ఆధార్, వయసు ధ్రువీకరణ పత్రాలు తీసుకు రావాలన్నారు. ఇతర వివరాలకు చరవాణి నం.99857 88989 లో సంప్రదించాలని సూచించారు. ఎంపికైన వారు 4-6 వరకు నిజామాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు.

యోగాతో ఆరోగ్యం.. శిక్షణతో ఆనందం

న్యూస్‌టుడే, మందమర్రి పట్టణం: వ్యాపారంలో రాణిస్తూ 30 మందికి ఉపాధి కల్పిస్తూ.. నిత్యం పనులతో బిజీగా ఉంటూ.. సమాజం కోసం ఏదైనా చేయాలని తపనతో 61 ఏళ్ల వయసులో విద్యార్థిగా మారి యోగాలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు కొంపెల్లి రమేశ్. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ.. మానసికంగా ఇబ్బందులు పడే వారికి తన యోగా శిక్షణతో ఉపశమనం కల్పిస్తూ మంచి పేరు సంపాదించుకున్న రమేశ్‌పై ప్రత్యేక కథనం.

● 61 ఏళ్ల వయసులో మాస్టర్ డిగ్రీ

కరోనా సమయంలో ఆసక్తి..

మందమర్రి పాత బస్టాండ్‌కు చెందిన కొంపెల్లి రమేశ్ పెట్రోల్ బంక్‌లు నిర్వహిస్తూ జీవితం గడుపుతున్నారు. కరోనా సమయంలో యోగాపై ఆసక్తి పెంచుకున్నారు. సామాజిక మాధ్యమం ద్వారా యోగా సాధన చేసి యోగా పోటీల్లో పాల్గొని బహుమతులు సైతం పొందారు.

అయిదేళ్లుగా..

యోగా సాధనలో లోతుగా అధ్యయనం చేయడం ప్రారంభించి ఇన్‌స్ట్రక్టర్, మాస్టర్(వైపీబీ), పీజీ డిప్లొమా, బెంగళూరులోని ఎస్ వ్యాస యూనివర్సిటీలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. అయిదేళ్లుగా సమయం కేటాయిస్తూ యోగా శిక్షణ ఇస్తున్నారు.

ఉచిత శిబిరం..

అనారోగ్యానికి గురైన 60 మందికి పైగా విశ్రాంత సింగరేణి, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వృద్ధులకు ఉచిత యోగా శిక్షణ ఇస్తూ మూడు నెలల కిందట ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం నాలుగు గంటలపాటు వారికి యోగా శిక్షణ ఇస్తున్నారు. అనారోగ్యం బారిన పడిన వారు సైతం యోగా సాధనతో ఉపశమనం పొంది ఆరోగ్యంగా జీవనం సాగిస్తున్నారు. తన విద్యను ఉచితంగా నేర్పించి పది మంది యోగా టీచర్లను సిద్ధం చేసి ఔదార్యం చాటుకున్నారు.


మందమర్రిలో విశ్రాంత ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్న రమేశ్

వంద మంది టీచర్లను సిద్ధం చేయడమే లక్ష్యం..

ఆరోగ్యపరంగా నేర్చుకున్న యోగాను ప్రతి ఒక్కరికి నేర్పించేందుకు ఉచిత శిక్షణ ఇస్తున్నాను. వంద మందికి పైగా యోగా శిక్షణ ఇచ్చి టీచర్లుగా తీర్చిదిద్ది వారితో ఉచిత శిక్షణ అందించాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నాను.
- కొంపెల్లి రమేశ్, మందమర్రి

అడుగు దూరంలో జూడో క్రీడాకారులు

● అంతర్జాతీయ ఎంపిక ట్రయల్స్‌కు క్రీడా పాఠశాల విద్యార్థులు


తరుణ్ హర్షవర్ధన్ రూన్సీ సహస్ర రామచరణ్

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం : జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలకు చెందిన అయిదుగురు పూర్వ, ప్రస్తుత జూడో క్రీడాకారులు అరుదైన ఘనతను సాధించేందుకు అడుగు దూరంలో ఉన్నారు. అండర్-18 ఎస్‌జీఎఫ్ అంతర్జాతీయ ఎంపిక ట్రయల్స్‌కు ఎంపికయ్యారు. వారు సెప్టెంబరు 17, 18వ తేదీల్లో ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్, దుండాలోని కమల్‌విహార్ ప్రాంతాల్లో నిర్వహించే అంతర్జాతీయ ఎంపిక ట్రయల్స్‌లో పాల్గొననున్నారు. ఇందులో వీరు ప్రథమ స్థానాల్లో నిలిస్తే అంతర్జాతీయ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబరు 3 నుంచి 8 వరకు బ్రెజిల్ దేశంలో జరిగే జిమ్నాసియాడ్ ఈవెంట్‌లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని దక్కించుకుంటారు.

ఎంపికైంది వీరే

ఆర్.తరుణ్ (55 కిలోల విభాగం), ఎం.హర్షవర్ధన్ (60 కిలోల విభాగం) ప్రస్తుతం వీరు ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. డి.రూన్సీ (57 కిలోలు) ఆదిలాబాద్ క్రీడా పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. జి.సహస్ర (48 కిలోలు), డి.రామచరణ్ (73 కిలోలు) వీరు హైదరాబాద్‌లోని హకీంపేట క్రీడా పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


సతీశ్

దస్తురాబాద్, న్యూస్‌టుడే : విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందిన ఘటన దస్తురాబాద్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పెర్కపల్లికి చెందిన ఎంబడి సతీశ్ (27) శనివారం రాత్రి ఇంట్లో ఉన్న ఇనుప కూలర్‌ను పక్కకు జరిపే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. పోలీసులు మృతదేహన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కుమార్ పేర్కొన్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం


చిన్నయ్య

సోన్, న్యూస్‌టుడే : సోన్ మండలంలోని జాఫ్రాపూర్‌కు చెందిన లోలం చిన్నయ్య(75) ఇటీవల అదృశ్యమయ్యారు. ఆదివారం సోన్ మండలం మాదాపూర్ వద్ద వాగులో ఆయన మృతదేహం లభ్యమైంది. చిన్నయ్య మతిస్థిమితం సరిగా లేనికారణంగా ఈ నెల 22న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన మృతదేహం లభ్యం కావడంతో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్సై దేవన్న వెల్లడించారు.

పులి దాడిలో దూడ హతం

సొనాల(బోథ్), న్యూస్‌టుడే : అటవీప్రాంతంలో మేతకు వెళ్లిన లేగ దూడపై పులి దాడి చేసి హతమార్చింది. గ్రామస్థుల కథనం మేరకు.. సొనాల మండలం దేవులనాయక్‌తండా, ఫూల్‌సింగ్‌నాయక్‌తండా గ్రామాలకు చెందిన ఆవులను దేవులనాయక్‌తండాకు చెందిన పశువుల కాపరి రాఠోడ్ రవి చింతల బోరి అటవీ ప్రాంతానికి శనివారం మేతకు తీసుకెళ్లాడు. ఆవులు మేత మేస్తుండగా పులి మందపై దాడి చేసి దూడను నోట కరుచుకుంది. పశువుల కాపరి కేకలు వేయగా వదిలి పారిపోయింది. అప్పటికే దూడ మృత్యువాత పడటంతో గ్రామస్థులు, అధికారులకు సమాచారాన్ని అందజేశారు. అటవీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ట్రాప్ కెమెరాలు అమర్చారు. ఫూల్‌సింగ్‌నాయక్‌తండాకు చెందిన ఆడె కిషోర్ అనే రైతుకు చెందిన దూడగా గుర్తించారు.

హుండీ దొంగ అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై షేక్ జుబేర్

తానూరు (భైంసా), న్యూస్‌టుడే : తానూరు మండలంలోని మొగిలి గ్రామంలో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం ఠాణాలో ఎస్సై షేక్ జుబేర్ వివరాలు వెల్లడించారు. మొగిలి గ్రామంలోని మహాలక్ష్మి ఆలయంలో ఆగస్టు 27న దొంగతనం జరిగింది. దర్యాప్తు జరిపిన పోలీసులు అనుమానితుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. గ్రామానికి చెందిన నిందితుడు లక్ష్మణ్ మద్యానికి అలవాటు పడ్డాడు. తాగడానికి డబ్బులు లేక అర్ధరాత్రి తరువాత ఆలయంలోని హుండీ తలుపును బలంగా లాగి అందులోని రూ.5 వేలు దొంగిలించాడు. ఈ మేరకు నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జిల్లావాసులు.. మారథాన్‌లో మెరిశారు

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే : ఏటా రాష్ట్ర రాజధానిలో ప్రతిష్ఠాత్మకంగా హైదరాబాద్ రన్నర్స్ నిర్వహించే ఎన్ఎండీసీ మారథాన్‌లో ఈ ఏడాది జిల్లా నుంచి పదుల సంఖ్యలో ఔత్సాహికులు భాగస్వాములయ్యారు. మారథాన్, హాఫ్ మారథాన్, 10 కిలోమీటర్ల విభాగంలో పాల్గొని నిర్ణీత సమయంలో విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. గుర్తింపు పత్రాలతో పాటు పతకాలను స్వీకరించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎస్సైగా పని చేస్తున్న కిరణ్(42.195 కిలో మీటర్లు) మొదటి మారథాన్ పూర్తి చేయగా.. జిల్లాకు చెందిన భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రావు, ఆయన కూతురు అరుణిమ, ఎడ్ల మహేశ్(నారాయణపేట డీసీఆర్‌బీ డీఎస్పీ), గడిగొప్పుల సతీష్(ఆసిఫాబాద్ జిల్లా ఎస్బీ సీఐ), అనంతుల దినేష్, వుత్తూరి వేణు, గుర్రం నర్సింహారెడ్డి, జనరల్ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీకర్‌రావు(సర్జరీ), స్వరూప్‌రావు, వెంకట్, ఎడ్ల శ్రీనివాస్‌తో పాటు జిల్లాలో పని చేసిన మహేందర్‌రెడ్డి(డీఎస్పీ), ముత్త రవికుమార్(సీఐ), కటికె రవిప్రసాద్(ఎస్సై) హాఫ్ మారథన్(21.097 కిలోమీటర్లు) పూర్తి చేశారు. పది కిలోమీటర్లను ఎడ్ల శ్రీదేవి, గాజుల కృష్ణకిశోర్, గడ్డం శ్రీనివాస్(న్యాయవాది), రాజు, సత్యనారాయణగౌడ్ పూర్తి చేసి పతకాలను పొందారు.


హాఫ్ మారథాన్ పూర్తిచేసుకున్న జిల్లావాసులతో ఎడ్ల మహేశ్(నారాయణపేట డీఎస్పీ), తదితరులు


తన కూతురు, మిత్రులతో కలిసి పాల్గొన్న భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రావు


తొలి మారథాన్ పూర్తి చేసిన ఎస్ఐ కిరణ్

పొన్నారి.. కూరగాయలతో సిరి

తాంసి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రానికి దగ్గరలోనే ఆ గ్రామం.. ఆ ఊరిలోకి అడుగుపెట్టగానే కూరగాయల తోటలే స్వాగతం పలుకుతాయి. ఊరంతా వీటిని పండిస్తుండటం విశేషం. ఏ కాలంలోనైనా నిత్య ఆదాయం ఆర్జిస్తున్నారు తాంసి మండలం పొన్నారి గ్రామ రైతులు. అయిదేళ్ల క్రితం వరకు అందరిలాగే ఈ గ్రామ రైతులు పత్తి సాగు చేసేవారు. పెట్టుబడులు పెరగడంతో పాటు కూలీల కొరత, పంట దిగుబడి తగ్గిపోవడం, మార్కెట్‌లో పంటకు సరైన మద్దతు ధర లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోయారు. చాలా మంది రైతులు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మరికొందరు విలువైన ఆస్తులను అమ్ముకోవాల్సి వచ్చింది. దిక్కుతోచని స్థితిలో ఉన్న పొన్నారి రైతులు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల సూచనలతో స్వల్పకాలంలో చేతికొచ్చే పంటల సాగు వైపు అడుగేశారు. పొలాల్లో కొంత భాగం పత్తి, సోయా, కంది ఇతర పంటలు మిగిలిన దాంట్లో కూరగాయలు పండిస్తున్నారు. ప్రధానంగా టమాటా, గోబీ, వంకాయ, బీరకాయ, పచ్చిమిర్చి, కాకర, చిక్కుడు, బెండ, పాలకూర, మెంతికూర, కొత్తిమీర, బచ్చలికూర, గొంగూర సాగుకు ప్రాధాన్యమిస్తున్నారు. పండించిన కూరగాయలను ఆదిలాబాద్ రైతుబజార్‌కు, వివిధ గ్రామాల్లో జరిగే సంతలకు తరలించి విక్రయిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో సాగు చేసిన రైతులు నాగ్‌పూర్, చంద్రాపూర్ మార్కెట్లకు తీసుకెళ్తున్నారు. చుట్టు పక్కల ఉన్న వ్యాపారాలు ఇక్కడికే నేరుగా వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. వాణిజ్య పంటలను వీడి కూరగాయల సాగుతో పొన్నారి గ్రామస్థులు ఆర్థికంగా ముందుకెళ్తున్నారు. వచ్చిన ఆదాయంతో పిల్లల చదువులకు అధికంగా ఖర్చు చేస్తున్నారు. కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలల్లో చేర్పించి ఉన్నత విద్యను అందిస్తున్నారు. కూరగాయల ద్వారా నిత్య ఆదాయంతో వ్యాపారాలు, ఇతర చోట అధిక వడ్డీకి అప్పులు తీసుకోవడం దాదాపుగా తగ్గిపోయిందని రైతులు అశోక్, రాంరెడ్డి, దేవిదాస్, విలాస్ చెబుతున్నారు.


సుంకిడి ఆదివారం సంతలో కూరగాయలు విక్రయిస్తున్న పొన్నారి రైతులు

● పొన్నారి గ్రామ జనాభా: 3,264 ● ఓటర్లు : 1836 ● రైతులు : 253 ● సాగు భూమి విస్తీర్ణం: 2,37


బాలుర విభాగంలో విజేతగా నిలిచిన హైదరాబాద్ జిల్లా జట్టు


అత్యాపత్య రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలికల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన నిర్మల్ జిల్లా క్రీడాకారులు

ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అత్యాపత్య అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో హైదరాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలవగా, బాలికల్లో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బాలురలో.. రంగారెడ్డి (ద్వితీయ), తృతీయ స్థానంలో నాగర్‌కర్నూల్, సంగారెడ్డి జిల్లాల జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో.. నిర్మల్ (ద్వితీయ), తృతీయ స్థానంలో రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు నిలవగా.. క్రీడాకారులకు మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. అతిథులుగా శేఖర్, లక్ష్మణ్, పోశెట్టి, బ్రహ్మయ్య, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి వన్నెల భూమన్న, సంజీవ్ హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరులో జమ్ము కశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో హాజరుకానున్నారని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. రాష్ట్ర పరిశీలకుడు పరమేశ్వర్, బాధ్యులు అజయ్, అమర్‌సింగ్, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీఐని పునరుద్ధరించే వరకు ఉద్యమిస్తాం


దీక్షలో పాల్గొన్న పొచ్చర, దిమ్మ గ్రామస్థులు

ఎదులాపురం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని సిమెంటు పరిశ్రమను పునరుద్ధరించే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని సీసీఐ సాధన కమిటీ, భారాస నాయకులు చందాల రాజన్న, సయ్యద్ సాజిద్‌ఉద్దీన్‌లు ప్రకటించారు. పరిశ్రమను పునః ప్రారంభించాలన్న డిమాండ్‌తో సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 22వ రోజుకు చేరిన నేపథ్యంలో ఆదివారం దిమ్మ, పొచ్చర గ్రామస్థులు శిబిరానికి చేరుకొని దీక్షలు కొనసాగించారు. యూనుస్ అక్బానీ, యాసం నర్సింగరావు, ఈశ్వర్‌దాస్, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, దాసరి రమేష్, శ్రీనివాస్, నారాయణరెడ్డి, నర్సయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మూగవేదన విని.. ఇందిరమ్మ ఇల్లు కట్టించి

తాంసి, న్యూస్‌టుడే : వారిది నిరుపేద కుటుంబం. భర్త, ఇద్దరు పిల్లలు మూగవారు. శిథిలావస్థకు చేరిన పెంకుటిల్లులో ఉంటున్నారు. తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని తాంసి మండలం పొన్నారికి చెందిన కీర్తి లక్ష్మీ ఆరు నెలల క్రితం కుటుంబ సభ్యులను వెంటబెట్టుకుని కలెక్టర్ రాజర్షిషాను కలిసి విన్నవించింది. స్పందించిన కలెక్టర్ విచారణ జరిపించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. ఇటీవల నిర్మాణం పూర్తికావడంతో కలెక్టర్‌ను కలిసి గృహప్రవేశానికి ఆహ్వానించింది. కోరిందే తడవుగా ఆదివారం కలెక్టర్ గృహ ప్రవేశానికి హాజరై ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. కుటుంబ సభ్యులందరికీ సారె (బట్టలు) పెట్టి అభినందించారు. మూగవారైన లక్ష్మీ భర్త రామన్న, పిల్లలు నవీన్, నందినికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గృహనిర్మాణ శాఖ అధికారులు రెడ్డి శంకర్, రమేష్, నసీర్, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, తహసీల్దార్ గణేష్ రాఠోడ్, ఆత్మ ఛైర్మన్ నారాయణ, సర్పంచి భూమన్న, ఉప సర్పంచి రాంరెడ్డి, కార్యదర్శి గంగన్న తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

బాసరలో 558 అక్షరాభ్యాసాలు

బాసర (ముథోల్), న్యూస్‌టుడే : ఆదివారం సెలవుదినంతో పాటు శ్రావణమాసం కలిసి రావడంతో బాసర అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో అమ్మవారి బాలాలయం భక్తులతో సందడిగా మారింది. వేకువజామున పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అమ్మవారి దర్శనం కోసం గంట, అక్షరాభ్యాసాల కోసం రెండు గంటల సమయం పట్టింది. అమ్మవారి ఆలయంలో 558 అక్షరాభ్యాసాలు జరిగాయి. అక్షరాభ్యాసాలు, గదులు, ప్రసాదాలు ఇతర సేవల వల్ల ఆలయానికి రూ. 6.09 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయాధికారులు తెలిపారు.


చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న వేద పండితుడు

ప్రత్యేక పూజలు

బాసర (ముథోల్) : బాసర అమ్మవారిని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత రాజ్యసభ ఎంపీ అశోక్ శంకర్‌రావు చవాన్ దంపతులు ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాధికారులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కుంకుమపూజ, మహాహారతి తదితర పూజలను నిర్వహించారు. ఆలయం తరపున సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అంతకుముందు మాజీ ముఖ్యమంత్రి దంపతులు బాసరలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. భాజపా మండల అధ్యక్షుడు సాయినాథ్ పటేల్, సీనియర్ నాయకుడు సతీశ్వర్‌రావు, భైంసా మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆనంద్‌రావు పటేల్ స్వాగతం పలికి సన్మానించారు. బాసర సీఐ దీపక్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ఫిర్యాదుల పెట్టె.. చూపాలి పరిష్కార బాట

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను నేరుగా తెలుసుకునేలా పాఠశాలల్లో, కస్తూర్బా, గురుకులాల్లో ప్రభుత్వం ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయించింది. బాలికల పట్ల ఉపాధ్యాయుల వెకిలిచేష్టలు, భోజనంలో అమలుకాని మెనూ, మరుగుదొడ్ల నిర్వహణ లోపం, పరిసరాల పరిశుభ్రతలో నిర్లక్ష్యం వంటివి స్వేచ్ఛగా తెలిపేందుకు ఈ పెట్టెలను ఏర్పాటు చేశారు. ప్రస్తుత తరుణంలో ఈ పెట్టెల సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోగలిగితే వారి సమస్యల పరిష్కారానికి బాటలు పడే అవకాశముంది. - న్యూస్‌టుడే-కలెక్టరేట్

గోడలే.. పాఠాలు చెబుతాయ్..

బేల, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించిన ప్రీ ప్రైమరీ తరగతులను చిన్నారులకు మరింత ఆహ్లాదకరంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా తరగతి గదుల గోడలపై అక్షరాలు, అంకెలు, రంగులు, పండ్లు, కూరగాయలు, పక్షులు, జంతువులు తదితర చిత్రాలతో ఆకర్షణీయంగా రూపొందించారు. చిన్నారుల తరగతి గదిలోకి అడుగుపెట్టగానే రంగురంగుల బొమ్మలు కనిపించేలా గోడలు తీర్చిదిద్దారు. పాఠ్యాంశాలకు అనుగుణంగా చిత్రాలు ఏర్పాటు చేయడంతో చూస్తూ.. ఆడుతూ.. నేర్చుకునేలా వాతావరణం ఏర్పడుతోంది. అక్షరాలు, సంఖ్యలను గుర్తించడం మొదలుకొని పండ్లు, కూరగాయలు, జంతువులు, శరీర భాగాలు వంటి అంశాలను పిల్లలు చిత్రాల ద్వారా సులభంగా తెలుసుకునే అవకాశం కలుగుతోంది.


చిన్నారులను ఆకట్టుకునేలా చిత్రాలతో అలంకరించిన బాధి ప్రాథమికోన్నత పాఠశాలలోని ప్రీ ప్రైమరీ తరగతి గది

ఆహ్లాదకర వాతావరణం

చిన్నారుల తొలి విద్యాభ్యాసంలో తరగతి గది వాతావరణం కీలక పాత్ర పోషిస్తుంది. అందుకు అనుగుణంగా గోడల పై వేసిన రంగురంగుల చిత్రాలు వారిలో ఆసక్తిని పెంచుతున్నాయి. బొమ్మలను చూపిస్తూ ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తుండటంతో పిల్లలు ఉత్సాహంగా స్పందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రీ ప్రైమరీ తరగతి గదులు చిన్నారులను ఆకట్టుకునే రంగుల బడులుగా మార్చుతున్నారు.

వెయ్యి మాటలెందుకు.. ఒక చిత్రం చాలదా



ఇక్కడ ఒక లారీ అడవిలో నరికిన చెట్లను తీసుకొని వెళ్తోంది. మరో ట్యాంకరు ఆక్సిజన్ తీసుకొని వస్తోంది. ఆ పక్కన మనుషులు ప్రాణవాయువును పైపుల ద్వారా స్వీకరిస్తున్నారు. మనం అడవికి నష్టం కలిగిస్తే భవిష్యత్తులో మనకే కష్టమని చెప్పే సందేశాత్మక చిత్రం నిర్మల్ అటవీ క్షేత్రం పరిధిలోని 'గండి రామన్న అర్బన్ పార్క్'లో కనిపించింది. అర్థం చేసుకున్న వారికి ఇంతకన్నా వివరంగా చెప్పాల్సిన అవసరం లేదని ఆ నందన వనంలో ఈ బోర్డుకేసి చూసిన వారికి అనిపించక మానదు. - న్యూస్‌టుడే, నిర్మల్ సిటీ

22ఏ భూ దోపిడీపై హైదరాబాద్‌లో మహాదీక్ష


మాట్లాడుతున్న భాజపా శాసన సభ పక్షనేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో 22ఏ (నిషేధిత భూముల జాబితా) ముసుగులో రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతున్న అక్రమాలను నిరసిస్తూ సెప్టెంబరు 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో మహాదీక్ష చేపట్టనున్నామని.. విజయవంతం చేయాలని భాజపా శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దీక్ష సన్నద్ధతపై నిర్మల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాఠోడ్ అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరగనున్న మహా దీక్షకు తరలిరావాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో భూబదిలీలు, ఆస్తుల బదలాయింపు పేరుతో సాగుతున్న కుంభకోణాలపై, ప్రభుత్వ అవలంబిస్తున్న మొండివైఖరిని ఎండగట్టేందుకు దీక్ష చేపడుతున్నట్లు వివరించారు. నిర్మల్ నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు. ప్రజలకు ఇబ్బందులపాలు చేయనున్న 22ఏ భూముల నిబంధనలు ఉపసంహరించుకునే వరకు ప్రజా ఉద్యమం కొనసాగుతుందన్నారు. సమావేశంలో నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మె రాజు, ఆకుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, కరిపే విలాస్, అంకం మహేందర్, పుర కౌన్సిలర్లు, సర్పంచులు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కలల సౌధం.. కరెంటు తీగలే ఆటంకం

ఇచ్చోడ, న్యూస్‌టుడే:

అత్యంత వెనుకబడిన ఆదివాసీ తెగల(పీవీటీజీ) సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాల అమలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో సమస్యలు వెంటాడుతున్నాయి. ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట్ గ్రామంలో పీవీటీజీ వర్గాలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు విద్యుత్తు తీగలు అడ్డంకిగా మారాయి. స్థలాలపై నుంచి తీగలు వెళ్తుండటంతో 15 ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. అధికారులు సమస్య పరిష్కరిస్తామని చెప్పినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.


కర్రల సహాయంతో తీగలను పక్కకు లాగి ఇళ్ల నిర్మాణ పనులు చేస్తున్నారిలా..

దుబార్‌పేట్‌లో పీవీటీజీ కుటుంబాలకు పీఎం జన్మన్ పథకం కింద 90 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు, సురక్షిత తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.


దుబార్‌పేట్‌లో ఇందిరమ్మ ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్తు తీగలు

ఇళ్ల నిర్మాణం చేపట్టిన ప్రాంతంలో విద్యుత్తు తీగలు నుంచి వెళ్తుండటంతో నిర్మాణ పనులు చేపట్టేందుకు లబ్ధిదారులు భయపడుతున్నారు. 15 కుటుంబాలకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. కొందరు కర్రలు పెట్టి, తీగలను పక్కకు లాగి పనులు సాగిస్తున్నారు.

విద్యుత్తు తీగల సమస్య పరిష్కారానికి ఇప్పటికే నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించామని విద్యుత్తు ఏఈ శ్రావణ్ తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

ఆసిఫాబాద్: 80085 73640 కాగజ్‌నగర్: 83418 12400
కౌటాల: 94401 00066 రెబ్బెన: 80085 73643

? జిల్లా కేంద్రంలోని రావులవాడ, బ్రాహ్మణవాడల్లో వానరాలు గుంపులుగా ఇళ్లలో చొరబడుతున్నాయి. సామగ్రిని చిందరవందర చేస్తున్నాయి. మనుషులపై దాడులు చేస్తున్నాయి. అధికారులు స్పందించి వీటిని తరలించేలా చర్యలు తీసుకోవాలి. - **అజయ్, కాలనీవాసి**

✔ త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - **అంజయ్య, పుర కమిషనర్, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే**

? మండలంలోని గుండాల గ్రామంలో సోయం బొజ్జిరావు విగ్రహం నుంచి గుడివాడకు వెళ్లే రహదారి చిత్తడిగా మారింది. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. - **జంగు, గుండాల. తిర్యాణి, న్యూస్‌టుడే**

✔ బురదమయంగా మారిన చోట మొరం వేసి మరమ్మతులు చేయిస్తాం. - **రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, గుండాల.**

? కౌటాల మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉంటోంది. ద్విచక్రవాహనాలు జారిపడిపోతున్నాయి. - **కృష్ణ, స్థానికుడు. కౌటాల, న్యూస్‌టుడే**

✔ ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తగిన చర్యలు తీసుకుంటాం. - **కైలాస్, పంచాయతీ కార్యదర్శి, కౌటాల**

? పట్టణంలోని వినయ్‌గార్డెన్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు లేక వాహనాలు వేగంగా వెళ్తున్నాయి. ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. - **శ్రీధర్, స్థానికుడు. కాగజ్‌నగర్, న్యూస్‌టుడే**

✔ క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. - **తిరుపతి, మున్సిపల్ కమిషనర్, కాగజ్‌నగర్**

? కాగజ్‌నగర్-పెంచికల్‌పేట ప్రధాన రహదారి నామానగర్ సమీపంలో 90 డిగ్రీల మూలమలుపు ఉంది. ఇక్కడ ఎలాంటి సూచికలు లేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. - **ఎర్రటి విలాస్, గ్రామస్థుడు**

✔ ఆ ప్రాంతం వద్ద సూచికలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. - **నరేష్, ఎస్సై, ఈజ్‌గాం. కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే**

? మండలంలోని ఇందాని గ్రామ పంచాయతీ కేంద్రంలో ప్రధాన రహదారికి ఇరువైపులా చెత్త పేరుకుపోయింది. దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నాం. - **హన్మంతు, గ్రామస్థుడు. వాంకిడి, న్యూస్‌టుడే**

✔ రెండు రోజుల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - **విద్యాశ్రీ, గ్రామ కార్యదర్శి, ఇందాని**

? పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ ఏరియా వరకు రోడ్డుపై నిత్యం పశువులు తిష్ట వేసి ఉంటున్నాయి. అధికారులకు విన్నవించినా చర్యలు కానరావడం లేదు. - **చంద్రశేఖర్, స్థానికుడు. సిర్పూర్(టి), న్యూస్‌టుడే**

✔ పశు యజమానులకు అవగాహన కల్పించి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం. - **వినోద్‌కుమార్, ఎంపీడీవో, సిర్పూర్(టి).**

? గోలేటి గ్రామపంచాయతీ పరిధిలోని వార సంత స్థలం వర్షం కురిస్తే అధ్వానంగా మారుతోంది. వినియోగదారులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. - **జి.సురేష్, గ్రామస్థుడు, రెబ్బెన, న్యూస్‌టుడే**

✔ త్వరలోనే మొరంతో చదును చేయించి రోడ్డు బురద కాకుండా చర్యలు తీసుకుంటాం. - **పోషం పంచాయతీ కార్యదర్శి**

? శివపెల్లి గ్రామంలోని పలు కాలనీల్లో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. - **రమేష్, కాలనీవాసి**

? శివపెల్లి గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక నిత్యం అవస్థలు ఎదురవుతున్నాయి. - **గ్రామస్థులు. చింతలమానెపల్లి, న్యూస్‌టుడే**

✔ ఎక్కడెక్కడ లేవో అక్కడ విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయిస్తాం. అధికారుల దృష్టికి తీసుకెళ్లి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తాను - **తిరుపతి, పంచాయతీ కార్యదర్శి**

వృద్ధాశ్రమానికి చేయూత


నిత్యావసర సరకులు అందజేస్తున్న టీఆర్‌ఎస్ నాయకురాలు పుష్పలత

రెబ్బెన, న్యూస్‌టుడే: టీఆర్‌ఎస్ జిల్లా నాయకురాలు పుష్పలత జన్మదినం సందర్భంగా.. రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లోని వృద్ధాశ్రమానికి ఆదివారం వృద్ధులకు నిత్యావసర సరకులు అందజేశారు. బియ్యం, పప్పు, నూనె, ఇతర సామగ్రి అందించారు. ఈ సందర్భంగా వృద్ధులతో కలిసి ఆమె కేకు కోశారు. కార్యక్రమంలో నాయకులు పెందూర్ ధర్మ, పోతురాజుల అనసూయ, చిట్యాల సంధ్య, రోజా, జ్యోతి, స్రవంతి, శారద పాల్గొన్నారు.

పెద్దపులి దాడిలో ఎద్దు మృత్యువాత

సిర్పూర్(టి), న్యూస్‌టుడే: మండలంలోని మేడిపల్లి గ్రామంలో మర్సుకోల తెలంగరావ్‌కు చెందిన ఎద్దు మేత కోసం రావణ్‌పల్లి అటవీ ప్రాంతానికి వెళ్లి పెద్దపులి దాడిలో మృతి చెందినట్లు ఎఫ్‌ఆర్‌ఓ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం మేత కోసం వెళ్లిన ఎద్దు తిరిగి రాకపోవడంతో యజమాని అటవీ ప్రాంతంలో వెతికారు. ఆచూకీ దొరకకపోవడంతో అధికారులకు సమాచారమిచ్చాడు. ఆదివారం ఉదయం అటవీ అధికారులు గాలించగా.. ఎద్దు కళేబరం కనిపించింది. పంచనామా నిర్వహించి పులి దాడిలోనే మృతిచెందినట్లు నిర్ధారించారు. నష్టపరిహారం కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేశామన్నారు. పెద్దపులుల సంచారం ఉన్నందున అనుమతి లేకుండా అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని ఆయన సూచించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

రెబ్బెన, న్యూస్‌టుడే: రెబ్బెన మండలం తక్కళ్లపల్లి ఫ్లైఓవర్ వద్ద ఆదివారం అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకొని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఎస్సై ఎ.వెంకటకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా రాజురా మార్కెట్ నుంచి నిజామాబాద్‌లోని గోవధశాలకు ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా పశువులను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వాహనంతోపాటు 11 పశువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. మహారాష్ట్రలోని మహేగాం (గోయాగాం)కు చెందిన మోబిన్, చంద్రపూర్‌కు చెందిన నిలేష్ రామచంద్ర దర్కాతే, సద్దాం మునీర్ షేక్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

బెజ్జూరు: మహారాష్ట్ర నుంచి జగిత్యాలకు అక్రమంగా తరలిస్తున్న 41 పశువులను శనివారం బెజ్జూరు పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై సర్తాజ్‌పాషా తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా మహారాష్ట్ర నుంచి జగిత్యాల మార్కెట్‌కు పశువులను తరలిస్తుండగా ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పశువులను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన సఫీయా బేగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప.. ఆదివారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. అండగా ఉంటామని భరోసానిచ్చారు. కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్, నాయకులున్నారు.

అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం



లింగాపూర్, న్యూస్‌టుడే : కష్టపడి పంటలు పండించే రైతన్నకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన జాదవ్ రమేష్ ఎనిమిది ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేస్తున్నారు. ప్రస్తుతం పంట పూత దశలో ఉండటంతో శనివారం రాత్రి అడవి పందులు పంటపై విధ్వంసం సృష్టించాయి. దాదాపు రెండెకరాల పంటను తొక్కి నాశనం చేశాయని బాధితుడు వాపోయారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరారు.

మంజూరై ఏళ్లు.. పూర్తికి ఇంకెన్నాళ్లు?

★ నత్తకన్నా హీనంగా.. గర్భిణుల విశ్రాంతి భవనం పనులు

బెజ్జూరు, న్యూస్‌టుడే:

ఏజెన్సీ ప్రాంతాల్లో సరైన రోడ్లు, వాగులపై వంతెనలు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలం మూడు నెలలపాటు దినదిన గండంగా గడుపుతుంటారు. ఈ సమయంలో గర్భిణుల కష్టాలు వర్ణనాతీతం. ప్రసవ సమయం దగ్గర పడితే ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు కొన్ని గ్రామాలకు అంబులెన్సులు కూడా వెళ్లలేని పరిస్థితి.

ఈ సందర్భాల్లో ఎడ్లబండ్లు, ఆటోలు, కాలినడకనే దిక్కు. ఇటువంటి సమస్యలను గుర్తించిన ప్రభుత్వం ఏటా వానాకాలం సమీపిస్తుండగానే.. గ్రామాల్లో ప్రసవ సమయం దగ్గర పడుతున్న వారిని గుర్తించి సమీప ఆసుపత్రికి చేర్చేందుకు ముందస్తు చర్యలు చేపట్టింది. ఈమేరకు గర్భిణుల విశ్రాంతి భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అయితే బెజ్జూరు మండలంలో మంజూరైన భవన నిర్మాణం నత్తకన్నా హీనంగా సాగుతోంది. దీంతో గర్భిణులకు ఇబ్బందులు తప్పడం లేదు.


కొనసాగుతున్న భవన నిర్మాణం

గర్భిణుల కోసం ప్రత్యేకంగా విశ్రాంత భవనం మంజూరు చేసినా.. అది ఏళ్లు గడుస్తున్నా పూర్తికాకపోవడంతో ఈ ప్రాంతవాసులు అవస్థలు పడుతున్నారు. ప్రసవం కోసం వచ్చిన వారు పీహెచ్‌సీలో ఉండాల్సిన పరిస్థితి. వారికి తోడుగా వచ్చిన కుటుంబ సభ్యులు చెట్ల కింద ఉంటున్నారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, ప్రసవించిన బాలింతలు కనీస వసతులు లేక ఆవరణలో నిరీక్షించాల్సి వస్తోంది.

ఆయా ప్రాంతాల నుంచి గర్భిణులు రాలేని పరిస్థితి ఉంటున్న నేపథ్యంలో ముందస్తుగా వారిని తీసుకొచ్చి ఈ భవనంలో ఉంచాలనే ఉద్దేశం మంచిదే అయినా.. నిర్మాణం పూర్తిచేయడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చూపుతున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి అసంపూర్తి భవనాన్ని పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బెజ్జూరు మండలంలో 2022లో గర్భిణుల విశ్రాంతి భవనం నిర్మాణాలకు 15 ఆర్థిక సంఘం (ఆరోగ్య విభాగం)కింద రూ.20.50 లక్షలు మంజూరు చేసింది. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో భవన నిర్మాణాల పనులు అదే సంవత్సరంలో ప్రారంభించారు.

ప్రారంభంలో పనులు బాగానే సాగినా.. స్లాబ్ వేసి వదిలేశారు. మళ్లీ ఈ ఏడాది గోడలు నిర్మించారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం, గుత్తేదారు నిర్లక్ష్యంతో.. పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ప్రమాదకరంగా రహదారిపై నీటి గుంత

తిర్యాణి మండలం చింతపల్లి గ్రామంలోని ఆత్రం రవి ఇంటి ఎదుట రహదారిపై ఉన్న నీటి గుంత ప్రమాదకరంగా మారింది. తిర్యాణి నుంచి రొంపల్లి వెళ్లే ఈ మార్గంలో వర్షం కురిస్తే చాలు గుంతలో నీరు చేరుతున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. మణిక్యాపూర్, రొంపల్లి గ్రామాలవాసులు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల గుంతకు తాత్కాలిక మరమ్మతు చేపట్టినా.. వర్షాలకు మొరం కొట్టుకుపోయింది. రాత్రివేళల్లో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో శాశ్వత మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, తిర్యాణి**

మురుగు కాలువలో కుళాయి పైపులు

కాగజ్‌నగర్ పట్టణంలోని పలు కాలనీల్లో మిషన్ భగీరథ పైపుల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కొన్నిచోట్ల మురుగు కాలువల గుండా పైపులు వేయడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ లీకేజీలతో తాగునీరు కలుషితమై మురుగు నీరు చేరే ప్రమాదం ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. కనీస రక్షణ లేకుండా పైపులైన్లు వేయించడం అధికారుల పట్టింపు లేనితనానికి నిదర్శనమని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని కోరుతున్నారు.



- న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ గ్రామీణం

వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

కెరమెరి, న్యూస్‌టుడే : మండలంలోని గోండుగూడలో ఆదివారం హనుమాన్ ఆలయ ప్రారంభోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పురోహితుడు కులకర్ణి బాపుదేవ్ మహరాజ్, అర్చకుడు జాదవ్ ధన్‌రాజ్‌ల ఆధ్వర్యంలో.. వేద మంత్రాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ప్రారంభంతో పాటు ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం హోమం జరిపారు. భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి ఆత్రం అన్నిగ, నిర్వాహకులు చాహకటి దేవ్‌రావు, జంగు, మోతీరాం పాల్గొన్నారు.


హోమం చేస్తున్న అర్చకులు, గ్రామస్థులు

మన్‌కీ బాత్.. దేశ స్ఫూర్తిని చాటే సందేశం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ ప్రతి నెలా చివరి ఆదివారం ప్రజలతో పంచుకునే మన్‌కీ బాత్ కార్యక్రమం దేశ స్ఫూర్తిని చాటే సందేశమని భాజపా సీనియర్ నాయకుడు, జిల్లా మాజీ అధ్యక్షుడు డా.కొత్తపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కార్యాలయంలో ప్రత్యేక తెరను ఏర్పాటు చేసి నాయకులతో కలిసి 137వ మన్‌కీ బాత్ ఎపిసోడ్‌ను వీక్షించారు. దేశంలోని అనేక విషయాలపై అవగాహన కలుగుతుందని, సామాజిక సమస్యలపై చర్చించడం, దేశంలోని వివిధ ప్రాంతాల విజయాలను తెలియజేయడం ద్వారా ప్రజలతో మమేకమవుతూ ప్రధాని సంభాషిస్తున్నారని పేర్కొన్నారు. పౌరులందరూ కార్యక్రమాన్ని వీక్షించాలని సూచించారు.


నాయకులతో భాజపా జిల్లా మాజీ అధ్యక్షుడు డా.శ్రీనివాస్

క్షేత్రస్థాయిలో పర్యటించి.. అవగాహన పొంది

కెరమెరి, న్యూస్‌టుడే: సిర్పూర్(యు) మండలానికి చెందిన పలువురు రైతులు.. ఆదివారం కేఫిన్ టెక్ సంస్థ సహకారంతో మండలంలోని ధనోరలో సేంద్రియ విధానంలో పండిస్తున్న కేంద్రె బాలాజీ వ్యవసాయ క్షేత్రాన్ని పర్యటించారు. తక్కువ సమయంలో అధిక దిగుబడి సాధించే నూతన వ్యవసాయ పద్ధతులను బాలాజీ వివరించారు. వర్మికంపోస్టు, పంచామృతం, జీవామృతం వంటి విషయాలపై అవగాహన పొందారు. ప్రాజెక్టు మేనేజర్ అనిల్ కుమార్, రైతులు పాల్గొన్నారు.



సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న రైతులు

చలో హైదరాబాద్ విజయవంతానికి పిలుపు


మాట్లాడుతున్న పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆడే ప్రకాష్

కెరమెరి, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఆడే ప్రకాష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏలు, పీఆర్సీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పరిష్కారం చేయకపోతే దశల వారీగా ఆందోళన కార్యక్రమం చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్ కుమార్, ప్రదీప్, తిరుమల, రంజిత పాల్గొన్నారు.

రెబ్బెన: ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం పీఆర్టీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇందిరా పార్కు వద్ద చేపట్టనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని.. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సునార్కర్ అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. రెబ్బెనలో మాట్లాడుతూ భవిష్యత్తు, కుటుంబాల భద్రత, హక్కుల సాధన కోసం చేసే పోరాటమన్నారు. ప్రతి ఉపాధ్యాయ, ఉపాధ్యాయురాలు నీలి రంగు షర్టు, చీర లేదా చుడిదార్ ధరించి రావాలని కోరారు. ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

తిర్యాణి: ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు దాగం ప్రశాంత్ కోరారు. ధర్నాలో మండలంలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కమిటీ ఎన్నిక

రెబ్బెన, న్యూస్‌టుడే: రెబ్బెన మండలం గోలేటి గ్రామ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. గ్రామ అధ్యక్షుడిగా బోగారం ప్రతాప్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అరికిల్ల పోషం, అధికార ప్రతినిధిగా కొత్రాల మహేష్, ఉపాధ్యక్షులుగా వడ్లూరి లింగయ్య, శనిగారపు శ్రీనివాస్, నంది శేఖర్, ప్రధాన కార్యదర్శిగా దుర్గం జనార్దన్, కార్యదర్శులుగా ఇగురపు రాజశేఖర్, ఇప్ప రాజలింగు, ప్రచార కార్యదర్శిగా ఇప్ప ప్రసాద్, సభ్యులుగా మేలం రాజ్‌కుమార్, ఇప్ప ప్రవీణ్, దుర్గం రాకేష్, కొత్రాల తిరుపతి, దూడల దశరథంలను ఎన్నుకొన్నట్లు జిల్లా ఇన్‌ఛార్జి థామస్ తెలిపారు.

దహెగాంలో..

పెంచికల్‌పేట్, దహెగాం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు. మండల నూతన కమిటీ నిర్మాణంలో భాగంగా ఆదివారం దహెగాం మండల కేంద్రంలోని రైతు వేదికలో సమావేశం నిర్వహించారు. మండల ఇన్‌ఛార్జి మహేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి థామస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ గ్రామాల నుంచి నాయకులు పాల్గొన్నారు. ఎన్నికల్లో మహేష్‌ను మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


ప్రతాప్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా ఇన్‌ఛార్జి థామస్

సాయం అందించి.. భరోసానిచ్చి

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని రాస్పెల్లి గ్రామానికి చెందిన మున్నూరు కాపు పటేల్స్ సంఘ సభ్యుడు బొమ్మెల్ల నరేష్ ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబాన్ని ఆదివారం మున్నూరు కాపు పటేల్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ పరామర్శించి.. నగదు సాయం చేశారు. కుటుంబానికి అండగా నిలిచి ఆదుకుంటామని భరోసానిచ్చారు. సర్పంచి కుందారపు సుమన్, నియోజకవర్గ అధ్యక్షుడు దెబ్బటి జలపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లి తిరుపతి, నాయకులు పర్వతి సురేష్, అశోక్, గోపాల్, రవి, మహేష్, తదితరులున్నారు.

కాగజ్‌నగర్: ఆపదలో ఉన్న కాపు కులస్థులకు మున్నూరు కాపు సంఘం అండగా ఉంటుందని జిల్లా అధ్యక్షుడు పెద్దపల్లి కిషన్‌రావు తెలిపారు. మండలంలోని రాస్పెల్లి గ్రామానికి చెందిన బొమ్మెల్ల నరేష్ ఇటీవల మరణించగా ఆదివారం కుటుంబీకులను సంఘ ప్రతినిధులతో కలిసి పరామర్శించారు. రూ.26,500 ఆర్థికసాయం అందజేశారు. నియోజకవర్గ అధ్యక్షుడు సుంకరి తిరుపతి, గౌరవాధ్యక్షుడు గజ్జి రామయ్య, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గోలెం వెంకటేశం, మండలాధ్యక్షుడు గజ్జి మహేష్, నాయకులు గోవిందుల రాజన్న, పులిశెట్టి వినోద్, సిద్దం సంతోష్, బొమ్మెల కిషన్, ఇనుముల ఉమాకాంత్, పుల్ల శ్రీకాంత్ తదితరులున్నారు.


చిన్నారులకు నగదు అందజేస్తున్న మున్నూరు కాపు పటేల్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్

2న ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడి ఎన్నిక

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడి ఎన్నికను.. సెప్టెంబర్ 2న నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు రాచకొండ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఉదయం 10-12 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, మధ్యాహ్నం 1-2 గంటల వరకు పరిశీలన, తుది జాబితా ప్రకటన, 3-4 గంటల వరకు ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన, 4-5 గంటల వరకు పోలింగ్, సాయంత్రం 5.30 గంటలకు ఓట్ల లెక్కింపు, విజేతను ప్రకటిస్తామని వివరించారు.

మంచిర్యాలలో ఏఐకేఎంఎస్ మహాసభలు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : మంచిర్యాల జిల్లాలో వచ్చే నెల 8, 9 తేదీల్లో జరగనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని.. ఆ సంఘం జిల్లా కన్వీనర్ పోషన్న పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సంఘ సభ్యులతో కలిసి దీనికి సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభ స్థితిని ఎదుర్కొంటోందని, పాలక వర్గాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలు, సరళీకరణ, ఆర్థిక విధానాలే కారణమని ఆరోపించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలు, భవిష్యత్తు కర్తవ్యాలపై సభల్లో చర్చ ఉంటుందన్నారు. జిల్లా నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సంఘ సభ్యులు వీరన్న, బాబా, అబ్దుల్లా, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, సమీర్, అఖిల్ తదితరులున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

వాంకిడి, న్యూస్‌టుడే: ఎస్పీ నితికాపంత్ ఆదేశాల మేరకు.. వాంకిడి పోలీసు స్టేషన్ పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో ఆదివారం ఉదయం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు, సిబ్బంది గ్రామస్థులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతకు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఎస్సై మహేందర్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని హితవుపలికారు. గుడుంబా తయారీ అమ్మకాల వంటి వాటికి దూరంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాంతకమని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని, లైసెన్స్‌తోపాటు సంబంధించిన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా 40 ద్విచక్రవాహనాలను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు.


గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మహేందర్

విద్యార్థి అదృశ్యం.. కేసు నమోదు

ఆదిలాబాద్ నేరవిభాగం : పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన డిగ్రీ చదువుతున్న అనురాగ్(20) అదృశ్యం కేసును ఆదివారం నమోదు చేసినట్లు సీఐ నాగరాజు తెలిపారు. ఈ నెల 21న తల్లి మందలించడంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడన్నారు.

ఆటో ఇంజిన్ అమర్చిన వారిపై..

ఆదిలాబాద్ నేరవిభాగం : ఒక ఆటోకు మరో ఆటో ఇంజిన్ అమర్చిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సునిల్‌కుమార్ తెలిపారు. జైనథ్‌కు చెందిన షేక్ కలీంకు చెందిన ఆటో ఇంజిన్‌ను షేక్ తౌఫిక్ ఆటోకు అనధికారికంగా అమర్చారన్నారు. తనిఖీల్లో ఆ ఆటో నంబరు ఏపీ25 ఎక్స్6152ను పరిశీలించగా ఇంజిన్ నంబరు మరొకటి ఉన్నట్లు గుర్తించామన్నారు.

నీట్ పీజీ పరీక్ష ప్రశాంతం

కలెక్టరేట్: నీట్ పీజీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణశివారులోని నలంద డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షిషా సందర్శించి అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో) పరీక్ష జరిగింది. బయోమెట్రిక్ ప్రక్రియ దృష్ట్యా ఉదయం ఏడు గంటల నుంచి అభ్యర్థులను క్షుణ్నంగా తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతించారు. మొత్తం 100 మందికిగాను అందరూ హాజరైనట్లు నోడల్ అధికారి గణేష్‌జాదవ్, సెంటర్ ఇన్‌ఛార్జి పున్నారావు తెలిపారు. ఏఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ జీవన్‌రెడ్డి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



విద్యుదాఘాతంతో పాక దగ్ధం

సొనాల(బోథ్), న్యూస్‌టుడే : విద్యుదాఘాతంతో పశువుల పాక దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. సొనాల మండలం దేవులనాయక్‌తండా పంచాయతీ పరిధిలోని పూల్‌సింగ్‌నాయక్‌తండాకు చెందిన రైతు జోర్‌సింగ్‌కు గ్రామ సమీపంలో పశువుల పాక ఉంది. ఆదివారం మధ్యాహ్నం విద్యుదాఘాతంతో పాకలో మంటలు చెలరేగాయి. అందులో ఉన్న ఎండు గడ్డి, వ్యవసాయ సామగ్రి, యూరియా, డీఏపీ బస్తాలు కాలి బూడిదయ్యాయి. గ్రామస్థులు మంటలను ఆర్పివేశారు.

భీంరావు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

ఉట్నూరు గ్రామీణం: ఆదివాసీ తొలి పట్టభద్రుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి గిరిజన శాఖ మంత్రి దివంగత కొట్నాక భీంరావు విగ్రహాన్ని ఉట్నూరులో అధికారికంగా ఏర్పాటు చేయాలని కుమురం భీం యువసేన వ్యవస్థాపకుడు పెందూర్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మాజీ మంత్రి కొట్నాక భీంరావు స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

షీ టీం సేవలపై అవగాహన

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో విద్యార్థులకు మహిళల భద్రత, రక్షణపై షీ టీం సిబ్బంది అవగాహన కల్పించారు. ఆదివారం స్థానిక వసతిగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వనిత, సతీష్‌లు షీ టీం అందిస్తున్న సేవలను వివరించారు. బాలికలు, మహిళల సంరక్షణే ధ్యేయంగా ఇది పని చేస్తోందని పేర్కొన్నారు.

తుడుందెబ్బ మండల అధ్యక్షుడిగా పంద్రం సురేష్



వాంకిడి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో తుడుందెబ్బ నూతన మండల కమిటీ ఎన్నికలు నిర్వహించారు. తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపాతి అరుణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్ అధ్యక్షతన. ఎన్నిక ప్రక్రియ కొనసాగింది. మండల అధ్యక్ష పదవికి పోటీలో అయిదుగురు పోటీలో ఉండగా చేతులు ఎత్తే విధానం ద్వారా ఎన్నిక నిర్వహించారు. సోనాపూర్ సర్పంచి పంద్రం సురేష్ అత్యధిక ఓట్లు సాధించి ఎన్నికయ్యారు. మిగతా కార్యవర్గాన్ని త్వరలో ఎన్నుకోనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్‌కుమార్ తెలిపారు.

బెజ్జూరు: బెజ్జూరు మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఆదివారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర నాయకుడు సోయం చిన్నయ్య తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా సిడాం సకారాం, మండలాధ్యక్షుడిగా కొర్తె తిరుపతి, ఉపాధ్యక్షుడిగా తలాండి భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా రమేష్, ప్రచార కార్యదర్శిగా నారాయణ, కార్యదర్శులుగా ఆత్రం సాయి, నారాయణ, సత్తయ్య, శంకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ఆదివాసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా తొర్రెం ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా వినోద్, ప్రధాన కార్యదర్శిగా మధూకర్‌లు ఎన్నికయ్యారు.

ప్రవక్త జీవితం.. మానవాళికి ఆదర్శనీయం


ప్రవచనాలు చెబుతున్న నిసార్ ఖాసిమీ

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : ముహమ్మద్ ప్రవక్త జీవితం మానవాళికి ఆదర్శనీయమని ముఫ్తీ అహ్మదుల్లా నిసార్ ఖాసిమీ, ముఫ్తీ అమీర్ రహ్మానీ ఖాసీమీలు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో అజ్మత్-ఏ-ముస్తఫా, ఇస్లాహ్-ఏ-ముషరా అంశంపై నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇస్లామిక్ జీవన విధానం, సామాజిక సంస్కరణలపై సూచించారు. యువత దైవభక్తి, నైతిక విలువలు పెంపొందించుకోవడంతోపాటు ఆధునిక విద్య, నైపుణ్యాలను మెరుగుపర్చుకుని సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉస్తాద్-ఉల్-ఉలమా హాఫీజ్ సయ్యద్ మునీర్ అహ్మద్, మౌలానా మీర్ అష్రఫ్ అలీ హష్మి అసదీ, మీర్ తాహెర్ అలీ హష్మి, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.